సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 3 । మార్చి । 2023



ఏపీ నుంచి ఇసుక రవాణా

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి ఇసుక అక్రమ రవాణా అవుతోంది. రాత్రివేళలో టిప్పర్‌లు, లారీల్లో తరలిస్తున్నారు. - 8లో



చక్రతీర్థం.. దోపోత్సవం

యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చక్రతీర్థం, సాయంత్రం దోపోత్సవం నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం 37°/18°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : యూజర్ చార్జీల పద్ధతిలో సర్వే పనులు నిర్వహించేందుకు జిల్లాలో లైసెన్స్ కలిగిన సర్వేయర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ల్యాండ్ సర్వే సహాయ సంచాలకుడు యం. నాగేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ మండలాల్లో యూజర్ చార్జీల పద్ధతిలో సర్వే పనులు నిర్వహించి, నివేదికలు సమర్పించేందుకు ఆసక్తి గల లైసెన్స్‌కలిగిన సర్వేయర్లు తమ సర్టిఫికెట్లు, అనుభవ ధ్రువీకరణ పత్రాలు, ఫొటో, ఆధార్ కార్డ్‌లతో ఈ నెల 10లోగా కలెక్టరేట్‌లోని జిల్లా ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 14న ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలి



నడిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్న ఆర్సీఓ

నడిగూడెం : వచ్చే వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ హెచ్.అరుణ కుమారి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల్లో చదవడం, రాయడంలో నైపుణ్యాలను పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం ప్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయ లక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్స్ ఎ.రవి కృష్ణ, ఎ.రేణుక, ఎ.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



రేషన్ డీలర్ల కాంటాలను పరిశీలిస్తున్న తూనికలు ,కొలతల శాఖ జిల్లా అధికారి

మద్దిరాల : చౌకధరల దుకాణాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికల, కొలతల శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించా. మండలంలోని ఆయా గ్రామాల డీలర్ల కాంటాల పనితీరును గురువారం మద్దిరాలలో పరిశీలించి మాట్లాడారు. కాంటాలలో ఎలాంటి మోసం జరిగినా లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

4న ఇంటర్ 'నైతిక విలువలు' పరీక్ష

కోదాడ: ఇంటర్ వార్షిక పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 4వ తేదీన నైతిక విలువలు, 6న పర్యావరణవిద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ బోర్డు అధికారి జానపాటి కృష్ణయ్య గురువారం వెల్లడించారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న జనరల్ విద్యార్థులు 6,727 మంది, వృత్తి విద్యాకోర్సులకు సంబంధించిన విద్యార్థులు 1,715 మంది ఇలా మొత్తం 8,442 మంది ఈ పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో థియరీకి 60 మార్కులు, ప్రాక్టికల్స్‌కు 40 మార్కులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు రాసిన వారికి మాత్రమే ఒరిజినల్ మార్కుల మెమో వస్తుందని, రాయనివారికి రాదని తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థి ఈ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్ టీపీ కోఆర్డినేటర్ల నియామకం

నల్లగొండ: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను నియమించారు. నల్లగొండ నియోజకవర్గానికి కె.గోవర్ధన్, మునుగోడుకు వనమాల పరమేష్ కుమార్, నాగార్జునసాగర్‌కు రమావత్ స్వామినాయక్, మిర్యాలగూడకు ఇంజం నర్సిరెడ్డి, హుజూర్‌నగర్‌కు జె.వెంకటేశ్వర్లు, కోదాడకు పచ్చిపాల వేణు, సూర్యాపేటకు పిట్టా రాంరెడ్డి, తుంగతుర్తికి ఏపూరి సోమన్న, ఆలేరుకు గ్యారా నగేష్, దేవరకొండకు సరోజీరెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● గ్యాస్ మంట



గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ సూర్యాపేటలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, మహిళా నేతలు



ప్లకార్డు ప్రదర్శిస్తున్న గిరిజన మహిళ



గరిడేపల్లిలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, చిత్రంలో ఎంపీ లింగయ్యయాదవ్

స్వచ్ఛత వైపు అడుగులు

- మెరుగైన ర్యాంక్ సాధన దిశగా ఐదు మున్సిపాలిటీల కసరత్తు
- చెత్తరహిత పట్టణాలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక
- తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారీ, వినియోగంపై అవగాహన
- త్వరలో క్షేత్రస్థాయిలో బృందాలు పరిశీలించే అవకాశం



హుజూర్‌నగర్ : ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

హుజూర్‌నగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ వైపు జిల్లాలోని పలు మున్సిపాలిటీలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. ఈసారి మెరుగైన ర్యాంకింగ్ దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. దీనిలో భాగంగా జోనల్, జాతీయ స్థాయిల్లో పోటీ పడుతున్నాయి. త్వరలో ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించే అవకాశం ఉండడంతో ఇప్పటికే అధికారులు స్వచ్ఛ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నారు. ఈ ఏడాది ఓడీఎఫ్(ఓపెన్ డిఫకేషన్ ఫ్రీ) తో పాటు గార్బేజ్ ఫ్రీ సిటీ నిర్వహణకు కేంద్రం ప్రాధాన్యమిస్తోంది. దీంతో ప్రతి మున్సిపాలిటీ పరిధిలో బహిరంగ మలమూత్ర విసర్జన వసతులు కల్పించాలి. ప్రతి ఇంటి ఆవరణలో మరుగుదొడ్డి ఉండటంతో పాటు వ్యర్థాలను సెప్టిక్ ట్యాంక్‌లోకి వదలాలి. ప్రధాన మార్గాలు, మురుగు కాల్వల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించ కూడదు. చెత్తరహిత పట్టణాలుగా కనిపించాలి. మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్లు అందుబాటులో ఉన్న చోట నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని పురపాలక శాఖ నిర్ణయించింది. త్వరలో తొలివిడత రెండు బృందాలు మున్సిపాలిటీలకు వచ్చి వివరాలపై ఆరా తీయనున్నాయి. మలి విడతలో మరో బృందం రానుంది.

తడి పొడి చెత్త సేకరణపై అవగాహన..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో స్వచ్ఛసర్వేక్షన్ ర్యాంకింగ్‌లో ఇప్పటికే సూర్యాపేట మున్సిపాలిటీ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్, హుజూర్‌నగర్, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలు ఓడీఎఫ్ ప్లస్‌లో ఉన్నాయి. ఈ ర్యాంకింగ్‌ను మరింత మెరుగు పర్చుకునేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతానికి పెంచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. తడి, పొడి చెత్త సేకరణపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయనున్నారు. వనరుల పునర్వినియో కేంద్రంలో సేకరించిన నిల్వలను వేరు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. పౌరుల స్పందనను పెంచేందుకు అందుకు అనుగుణంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



మున్సిపాలిటీల పరిధిలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను ప్రజలు ఉపయోగించుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తే అవి దుర్గంధం వెదజల్లి పరిసరాల్లో ఉన్న ప్రజలను ఇబ్బందులు కలిగిస్తాయి. ఈసారి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ కూడా ప్రధాన అంశంగా ఉంది. ఈ నేపథ్యంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. అందుకు పట్టణ ప్రజలు కూడా సహకరించాలి.

– గెల్లి అర్చన, మున్సిపల్ చైర్‌పర్సన్, హుజూర్‌నగర్

ఐదు మున్సిపాలిటీల పరిధిలో..

సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేయడమే కాకుండా ప్రజా మరుగుదొడ్లను అందుబాలోకి తెచ్చారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో 65 మెట్రిక్ టన్నుల (ఎంటీల) చెత్త ఉత్పత్తి అవుతుండగా ఇందులో 10 ఎంటీల తడిచెత్తను కంపోస్టు ఎరువుకు, 55 ఎంటీల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కోదాడలో 30 మెట్రిక్ టన్నులు చెత్త వస్తుండగా దానిలో 10 ఎంటీల తడి చెత్తను కంపోస్టు ఎరువుకోసం, 20 ఎంటీల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. హుజూర్ నగర్‌లో 16 ఎంటీల చెత్త ఉత్పత్తి అవుతుండగా ఇందులో 6 ఎంటీల తడి చెత్తను కంపోస్టు కోసం, 10 ఎంటీల చెత్తను డంపింగ్ యార్డుకు, తిరుమలగిరిలో 8 ఎంటీల చెత్త వస్తుండగా 2 ఎంటీల తడి చెత్తను కంపోస్టుకు, 6 ఎంటీల చెత్తను డంపింగ్ యార్డుకు, నేరేడుచర్లలో ఉత్పత్తి అయ్యే 6ఎంటీల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అలాగే మున్సిపాలిటీల్లో ప్రజా మరుగు దొడ్లును కూడా అందుబాటులోకి తెచ్చారు. సూర్యాపేటలో 22 చోట్ల 135 మరుగు దొడ్లు, కోదాడలో 7 చోట్ల 75, హుజూర్ నగర్‌లో 5 చోట్ల 36, తిరుమలగిరిలో 3 చోట్ల 12, నేరేడుచర్ల పరిధిలో 3 చోట్ల 15 మరుగు దొడ్లను ప్రజా అవసరాల కోసం అందుబాటులోకి తెచ్చారు.

15నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

- తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి
- 'మనఊరు మన బడి' పనులపై కలెక్టరేట్‌లో సమీక్ష



మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఈఓ అశోక్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో మన ఊరు – మనబడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధి పనులను ఈనెల 15 నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి కోరారు. పాఠశాలల్లో చేపట్టిన పనులపై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటివరకు మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత కింద 329 పాఠశాలలు ఎంపిక చేయగా పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన 56 పాఠశాలల్లో 4 ప్రారంభం కాగా 6 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటిని స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మిగిలిన 46 మోడల్ స్కూళ్లను ఈనెల 15 నాటికి సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు సక్రమంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్, డీఈఓ అశోక్, ఇంజనీరింగ్ అధికారి రమేష్, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ టి.శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓలు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి ఉండొద్దు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. గురువారం వెబెక్స్ ద్వారా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంపీఓలు, ఏపీఓలు, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ ఉదయం 4 గంటలలోపు పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలన్నారు. ఈ నెల 15 నాటికి ప్రతీ గ్రామంలో 100 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం నిర్వహణ పూర్తిగా గ్రామ పంచాయతీలదేనని, చట్టం ప్రకారం పంచాయతీ కార్యదర్శులే సంపూర్ణ బాధ్యత వహించాలన్నారు. కూలీలకు పనులు కల్పించడంలో విఫలమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని నర్సరీల్లో విత్తనాలు నాటడం పూర్తయి ఉండాలని, నేటి నుంచి మండల ప్రత్యేక అధికారులతో నర్సరీలు తనిఖీ చేయాలన్నారు. గ్రామాల్లో వీధి కుక్కల నివారణలో భాగంగా వాటిని పట్టుకొని దూరంగా వదలడం లేదా సంతాన నిరోధక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీపీఓ యాదయ్య, అడిషనల్ పీడీ పెంటయ్య పాల్గొన్నారు.

లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలి

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్

మేళ్లచెరువు : రాష్ట్రంలో ఉన్న లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలని ఎంపీ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మేళ్లచెరువు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. లిఫ్టుల భారాన్ని సర్కారు భరించాలన్నారు. ఈప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో తన గళం వినిపిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట నుంచి జాన్‌పహాడ్ వరకు ప్యాసింజర్ రైలు ఏర్పాటుకు అధికారులతో మాట్లాడుతానన్నారు. డోర్నకల్, నేలకొండపల్లి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, వర్దాపురం మీదుగా మిర్యాలగూడ వరకు రైల్వే లైన్ సర్వే పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. విద్యుత్, తాగునీరు, ఆరోగ్యం, రోడ్లు వంటి సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్, జెడ్పీటీసీ పద్మ , వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడుదాం



సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట : ప్రమాద ఘటనల్లో ప్రాణాలను కాపాడాలని జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. గురువారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిసిసిటేషన్) చేసే విధానంపై రాష్ట్ర రోడ్ సేఫ్టీ విభాగం, జీవీకే సంస్థ అత్యవసర విభాగం వారి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి, విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ప్రమాదాలు సంభవించి ఒక వ్యక్తి గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోని స్థితిలో ఉన్నప్పుడు వారి ప్రాణాలు కాపాడడానికి హృదయశ్వాసకోశ పునరుజ్జీవన చర్య అనేది చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఇది విద్యుత్ షాక్, నీటిలో మునిగినప్పుడు, రోడ్డు ప్రమాదాల బారిన పడినప్పుడు, అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినప్పుడు శ్వాస తీసుకోలేక గుండె ఆగిన సందర్భాల్లో అప్పటికప్పుడు అత్యవసరంగా వెంటనే ఛాతీ మధ్యలో పలుమార్లు బలంగా నొక్కడం వల్ల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా పోలీసు సిబ్బంది అందరికీ ఈ శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు రోడ్ సేఫ్టీ డీఎస్పీ చంద్రభాను, డీఎస్పీ నాగభూషణం, జీవీకే ఎమర్జెన్సీ సంస్థ డాక్టర్ మధుసూదన్, ఎస్ఐలు విష్ణు మూర్తి, శ్రీకాంత్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్టర్లు.. ప్రైవేట్ ప్రాక్టీస్

- ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు
- కోదాడ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్, కాంట్రాక్టు వైద్యుడి తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ



కోదాడ ప్రభుత్వ డాక్టర్ల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బసవయ్య(ఫైల్)

కోదాడ: నలుగురికి ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేట్ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్నారు. సదరు వైద్యశాల వద్ద సూపరింటెండెంట్ ఫొటోతో పెద్ద ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు. ఆమె బాటలోనే ప్రభుత్వ కాంట్రాక్టు వైద్యుడు కూడా పయనిస్తున్నారు. ఈ విషయాన్ని బుధవారం కోదాడకు వచ్చిన కలెక్టర్ వెంకట్రావుకు స్థానిక సామాజిక కార్యకర్త కుదరవెల్లి బసవయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ చెప్పడంతో ఈ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది.


ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక..

కోదాడ పట్టణంలో 30 పడకల ప్రభుత్వ వైద్యశాల ఉంది. స్థానిక వైద్యుల నిర్లక్ష్యానికి తోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణలేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. లక్ష మంది జనాభా ఉన్న పట్టణంలో కనీస వైద్యసేవలందించడంలో ఈ వైద్యశాల పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 30 పడకలు ఉన్న ఈ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తూ, ఐదు పడకలనే కేటాయించారు. దీంతో వైద్యశాల స్థాయి తగ్గిపోయింది. పడకలస్థాయి కన్నా సిబ్బంది ఎక్కువగా ఉన్నారని ఇటీవల కొంత మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించారు. ఒక పక్క వైద్యశాలను వంద పడకల స్థాయికి పెంచాలని పట్టణ వాసులు కోరుతుండగా అందుకు భిన్నంగా జరగడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌లో సేవలు..

కోదాడ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ దాదాపు 12 ఏళ్లుగా ఇక్కడే వైద్య సేవలందిస్తున్నారు. కొంత కాలంగా ఆ సూపరింటెండెంట్ కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గైనకాలజీ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారని నిర్వాహకులు పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వైద్యశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న మత్తు డాక్టర్ కూడా ఈ ప్రైవేట్ వైద్యశాలలో పని చేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేయడం గమనార్హం. కోదాడ వైద్యశాలలో ఇద్దరు మత్తు డాక్టర్లు ఉండగా ఒకరిని నడిగూడెం వైద్యశాలకు పంపాలని కోరినా ఇక్కడే అవసరం ఉందని ఆ వైద్యుడిని సూపరింటెండెంట్ రిలీవ్ చేయలేదని సమాచారం. సాధారణ కాన్పులు చేయాలని ప్రభుత్వం చెబుతుండగా ఆపరేషన్‌ల కోసం ఇద్దరు మత్తు డాక్టర్లు అవసరమని చెప్పడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఈ వైద్యశాల విషయంలో సమగ్ర విచారణ జరిపి గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై వివరణ కోరేందుకు సూపరింటెండెంట్‌కు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

ప్రైవేట్‌తో కుమ్మక్కు అవుతున్నారు




కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, నిర్వాహకులు సక్రమంగా పని చేయకుండా ఇక్కడికి వచ్చే కేసులను ప్రైవేట్ వైద్యశాలలకు పంపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ కనీస వైద్యసేవలందడం లేదు. వైద్యశాల సూపరింటెండెంట్ ప్రైవేట్ వైద్యశాలలో పని చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. అన్ని విషయాలను కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. విచారణ చేసి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

– కుదరవెల్లి బసవయ్య, కోదాడ

నాలుగేళ్లుగా ఎదురుచూపులే..

- మహిళా సంఘాలకు అందని వడ్డీ
- జిల్లా వ్యాప్తంగా రూ.109.35 కోట్ల బకాయిలు
- వాయిదాలు చెల్లిస్తున్నా జమకాని వడ్డీ డబ్బులు



సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

నాగారం : పేదరిక నిర్మూలన పథకంలో భాగంగా మహిళా సంఘాలకు ప్రభుత్వం ఏటా బ్యాంకు లింకేజీ ద్వారా అందిస్తున్న రుణాలకు చెల్లించిన వడ్డీ డబ్బులు తిరిగి మహిళా సంఘాల ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మహిళా సంఘాల ఖాతాల్లో 2018–19లో రూ.16.93కోట్లు, 2019–20లో రూ.30.66కోట్లు, 2020–21లో రూ.30.64కోట్లు, 2021–22లో రూ.31.12కోట్లు మొత్తం రూ.109.35 కోట్లు ప్రభుత్వం నుంచి వడ్డీ జమ కావాల్సి ఉంది. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేకుండా రుణాలు అందిస్తున్నామని, వడ్డీ ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు చెబుతున్నా అది సకాలంలో అందని పరిస్థితి. బ్యాంకుల్లో తీసుకున్న రుణాల వాయిదాలను వడ్డీతో కలిపి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. అయితే ప్రతి నెలా చెల్లిస్తున్న వడ్డీ బకాయిలు పేరుకుపోతున్నాయే తప్ప తిరిగి చెల్లించడంలో ప్రభుత్వం నాలుగేళ్లుగా జాప్యం చేస్తోంది.

సంఘాలపై వడ్డీల భారం

స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను వాయిదాల పద్ధతిలో క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. సంఘాల డబ్బులు చెల్లిస్తున్న క్రమంలో ప్రభుత్వం నాలుగు, ఐదు నెలలకోసారి వడ్డీ డబ్బులను విడుదల చేస్తుంది. అలా వచ్చిన డబ్బులను బ్యాంకులో ఉన్న మొత్తం రుణంలో తగ్గిస్తారు. దీంతో వడ్డీ భారం సంఘాలపై పడదు. అయితే నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన వడ్డీ డబ్బులు సంఘాల ఖాతాల్లో జమ కాకపోవడంతో ఆ ప్రభావం సంఘం సభ్యులపై పడుతోంది. తీసుకున్న రుణాలను రూపాయి వడ్డీతో కలిపి మహిళా సభ్యులు కిస్తీలు చెల్లిస్తున్నారు.

రూ.కోట్లల్లో బకాయిలు

జిల్లాలోని 23 మండలాల పరిధిలో 14,351 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 1,43,510 మంది సభ్యులు ఉన్నారు. వీరికి 2019 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రాయితీ వడ్డీ విడుదల కాలేదు. 2019–2022 వరకు మొత్తం రూ.109.35 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మార్చి తరువాత ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది. తమకు రావాల్సిన వడ్డీ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వడ్డీ రాక ఇబ్బందులు పడుతున్నాం



బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాలకు ప్రభుత్వం నుంచి నాలుగేళ్లుగా వడ్డీ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నాం. మహిళా సంఘాలపై భారం పడకుండా ప్రభుత్వం నుంచి రావాల్సిన వడ్డీని త్వరగా విడుదల చేసి ఆదుకోవాలి.

– ఎస్.కె. నూర్జహాన్, మహిళా సంఘం సభ్యురాలు, తుంగతుర్తి

నిధులు రాగానే జమచేస్తాం



వడ్డీ డబ్బులను ప్రభుత్వమే నేరుగా మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేస్తుంది. నిధుల విడుదలకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. సంఘాలకు రావాల్సిన వడ్డీ రుణం, తదితర వివరాలను ప్రభుత్వానికి నివేదించాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మాడ్గులపల్లి మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన కోల రాములు(62) బుధవారం రాత్రి తన కిరాణ దుకాణంలో ఫ్రిడ్జ్ డోర్‌తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న కోల జానయ్య వెంటనే రాములును మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమార్తె దొనేటి మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

బొమ్మలరామారంలో మరొకరు


సత్యనారాయణ(ఫైల్)

బొమ్మలరామారం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన బొమ్మలరామారం మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన ఇండ్ల సత్యనారాయణ(55) గ్రామ సమీపంలోని షామీర్‌పేట్ వాగు వైపు వెళ్లాడు. వాగులో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చేపలు పట్టడానికి విద్యుత్ వైర్లు వేసి ఉంచారు. ఇది గమనించని సత్యనారాయణ కరెంట్ వైర్ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకన్న ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరి జలాలు తగ్గింపు



అర్వపల్లి: జిల్లాకు వస్తున్న గోదావరి జలాలను గురువారం తగ్గించారు. వారబందీ విధానంలో ఇప్పటి వరకు 1800 క్యూసెక్కుల జలాలు వస్తుండగా వీటిని 1510 క్యూసెక్కులకు తగ్గించారు. ఈనీటిని జిల్లాలోని 69,70,71 డిస్ట్రిబ్యూటరీలకు వదులుతున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా పంటలకు వాడుకోవాలని సూచించారు.

రసాయన ట్యాంకర్ పట్టివేత

చౌటుప్పల్: మండల పరిధిలోని కొయ్యలగూడెంలో గల ఎస్‌వీల్యాబ్ వద్ద స్థానికులు గురువారం రసాయన ట్యాంకర్‌ను పట్టుకున్నారు. పరిశ్రమ నుంచి ప్రమాదకరమైన వ్యర్థ రసాయనాలను తరలిస్తుందన్న అనుమానంతో స్థానికులు ట్యాంకర్‌ను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ట్యాంకర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్యాంకర్‌లో ఉన్నది రసాయనాలా లేక వ్యర్థ రసాయనాలా అనే విషయాన్ని గుర్తించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ ఎరమాద మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

ఏపీ నుంచి ఇసుక రవాణా

- ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమ తరలింపు
- చెక్‌పోస్టులు తప్పించుకునేందుకు గ్రామాల మీదుగా వస్తున్న లారీలు
- మామూళ్లు తీసుకుని పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపణలు
- ఫిర్యాదులు వస్తే నామమాత్రంగా కేసులు నమోదు


ఇసుక తరలిస్తూ వారం క్రితం పట్టుబడిన లారీ


నంబర్ ప్లేట్ లేని టిప్పర్‌లో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి జోరుగా ఇసుక అక్రమ రవాణా అవుతోంది. రాత్రికి రాత్రే టిప్పర్‌లు, లారీలు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల మీదుగా కోదాడ, హైదరాబాద్‌కు చేరుకుంటున్నాయి. ఈ విషయం తెలిసిన ఓ పోలీస్ అధికారి టిప్పర్, లారీకి వేర్వేరుగా రేటు మాట్లాడుకొని ఇసుక వ్యాపారుల దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఈ దందా ఎక్కువ కావడంతో కొందరి ఫిర్యాదుల మేరకు తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు కూడా వచ్చాయి. కోదాడలోని కొందరు వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్లలో కొందరు వ్యాపారులతో చేతులు కలిపి ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ఇసుకను రవాణా చేస్తున్న వాహనాల్లో కొన్నింటికి నంబర్ ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం.

సరిహద్దు గ్రామాల మీదుగా..

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్ల ప్రాంతాల్లోని వాగుల నుంచి ఈ ఇసుక వ్యాపారం సాగుతుంది. అక్కడి ప్రభుత్వం డీడీలు తీస్తే ఇసుక రీచ్‌లను బట్టి రూ.450 నుంచి రూ.800 వరకు విక్రయిస్తుంది. అయితే అక్కడి ప్రధాన వాగుల్లో ప్రస్తుతం నీటి ప్రవాహం లేకపోవడంతో కొందరు వ్యాపారులు రీచ్‌ల నుంచి కాకుండా వేరే చోట్ల నుంచి రాత్రి సమయాల్లో జేసీబీలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి టిప్పర్‌లు, లారీల ద్వారా ఇసుకను తెలంగాణలోకి రవాణా చేస్తున్నారు. అయితే ఈ వాహనాలు తెలంగాణలోని కోదాడకు రావాలంటే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న అటు చిల్లకల్లు, ఇటు చిమిర్యాల చెక్‌పోస్టులను దాటి రావాల్సి ఉంది. ఈ మార్గంలో వస్తే చెక్‌పోస్ట్ సిబ్బంది పట్టుకుంటారనే భయంతో ఆ వాహనాలను ఏపీలోని జగ్గయ్యపేట మీదుగా దొండపాడు, అన్నారం, రెడ్లకుంట, కాపుగల్లు, గుడిబండ గ్రామాల మీదగా కోదాడకు తరలిస్తున్నారు. ఇలా వచ్చిన ఇసుకను తెల్లవారుజామునే వేబ్రిడ్జి కాంటాపెట్టి కొందరు కోదాడతో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుండగా మరికొందరు హైదరాబాద్ తరలిస్తున్నారు.

భారీగా వసూళ్లు

ఈ అక్రమ ఇసుక దందాకు సహకరించేందుకు ఓ పోలీస్ అధికారి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కొందరి వద్ద నెల నెలా మామూళ్ల లెక్కన మాట్లాడుకోగా, మరికొందరి వద్ద లారీ, టిప్పర్‌కి వేర్వేరుగా రేటు మాట్లాడుకుని ఇసుకను తరలించేందకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

తక్కువ రేటుకు విక్రయిస్తూ..

ఇలా అక్రమంగా తక్కువ రేటుకు తీసుకొచ్చిన ఇసుకను ఆ వ్యాపారులు టన్ను రూ.900 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. అయితే అన్ని అనుమతులు తీసుకొని డీడీలు చెల్లించి ఇసుక వ్యాపారం చేస్తున్న మరికొందరు ఈ ధరకు అమ్మితే తమకు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఇసుక వ్యాపారులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా వస్తున్న ఇసుక లారీలు, టిప్పర్‌లపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. ఇసుక అక్రమంగా రవాణా చేసే వారిపై ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాలో పోలీసుల సహకారం ఉందనే ఆరోపణలు అవాస్తవం.
– వెంకటేశ్వరరెడ్డి, డీఎస్పీ, కోదాడ

వైభవంగా చక్రతీర్థం.. దోపోత్సవం


ఆలయంలో దేవతోద్వాసన పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

- కొనసాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు
- మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన, పుష్పయాగం నిర్వహించిన ఆచార్యులు
- నేడు శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో ఉత్సవాల ముగింపు


స్వామి వారికి హారతి ఇస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం ప్రధానాలయంలో ఆచార్యులు నిత్యారాధనలు, ప్రభాతబేరీ, విష్ణుసహస్ర నామ పారాయణాలు జరిపించారు. అనంతరం ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. 11.30గంటలకు మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి, ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేసి కొండపై గల విష్ణు పుష్కరిణిలో చక్రతీర్థం చేపట్టారు. అంతకుముందు ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులు, శ్రీచక్ర ఆళ్వారుడిని ప్రత్యేక పల్లకీపై అధిష్ఠింపజేసి పూజలు చేసి సుదర్శ నారసింహ అలంకారంలో ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తూ విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి శుద్ధమైన జలంలో స్నానం చేయించారు. అనంతరం ఆలయ ఆచార్యులు, అధికారులు పుష్కరిణిలో స్నానం ఆచరించారు. విష్ణు పుష్కరిణిలో పూజించిన శుద్ధ చక్రతీర్థ జలాన్ని ప్రచార రథంలో ఊరేగింపుగా తీసుకెళ్లి కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో కలిపారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున అందులో పుణ్యస్నానాలు ఆచరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం నిత్యారాధనల అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం ఆచార్యులు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, దోపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, యాజ్ఞీకులు, రుత్వికులు, ఆచార్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం జరిపించనున్నారు. రాత్రి 9గంటలకు శృంగార డోలోత్సవం నిర్వహించి ఉత్సవాలను పరిసమాప్తం చేయనున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య వారిచే ప్రభాత భేరీ, భూదాన్‌పోచంపల్లికి చెందిన శ్రీలక్ష్మీనారాయణ భజన మండలి, యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన శ్రీభాగ్యలక్ష్మీ భక్త భజన మండలిచే భజన నిర్వహించారు. అనంతరం ఆస్థాన మంగళవాయిద్యం, ఆస్థాన వైదిక ప్రార్థనలు, నృసింహతత్వంపై కేవీ నరసింహచార్యులు ఉపన్యాసం గావించారు. విరాట పర్వం హరికథను ముదపాక బాలసుందరం, భాగవతార్ గానం చేశారు. సాయంత్రం సుస్వర ఆకాడమీచే భక్తీ సంగీతం, బృందావని బృందం, సాంస్కృతిక కళామండలి బృందం, కూమారి లహరి బృందం, హరిత బృందం, కుమారి నాగదుర్గ బృందంలచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. రాత్రి నూక జగదీశ్వరిచే ప్రధానాలయంలో భక్తి సంగీతం, శ్రీలక్ష్మీనారాయణ భాగవతార్‌చే దోపు కథను నిర్వహించారు.


నృత్యం చేస్తున్న కళాకారిణి


యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆచార్యులు


కొండ కింద లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: విద్యార్థులు చిన్నప్పటి నుంచే సృజనాత్మకతను అలవర్చుకోవాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ విద్యా వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీగౌతమ్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులు సుమారు 250 వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సమ్మక్క, సారలమ్మ గద్దెలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్, పాఠశాల వ్యవస్థాపకుడు మిర్యాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు ప్రత్యేక పూజలు..

పట్టణంలోని 12వ వార్డు పాతగుట్టలో జరుగుతున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట కౌన్సిలర్ దండబోయిన అనిల్, గుండ్లపల్లి వాణి, గౌళికార్ అరుణ తదితరులున్నారు.

యాకేష్‌పై పీడీ యాక్టు నమోదు

- చర్లపల్లి జైలుకు తరలింపు

భువనగిరి: మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన మేడబోయిన యాకేష్‌పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ గురువారం తెలిపారు. వివరాలు.. విద్యార్థినులపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ లాంటి ఆరోపణలతో 2015లో భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మేడబోయిన యాకేష్‌పై కేసు నమోదైంది. అతని ప్రవర్తనలో మార్పు రాకపోగా.. తిరిగి అమ్మాయిలను వేధింపులకు గురి చేయడంతో 2018లో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. 2023 జనవరి 7న భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలికను ఇంట్లో నిర్బంధించి లైంగిక వేధింపుల ఆరోపణలో కేసు నమోదు చేసి జ్యూడీషియల్ కస్టడీలోకి తీసుకున్నారు. యాకేష్ ప్రవర్తన, కార్యకలాపాలు ప్రజలకు హాని కలిగించే విధంగా ఉండటంతో పీడీ యాక్టు నమోదు చేసి గురువారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.


యాకేష్‌ను చర్లపల్లి జైలుకు తరలిస్తున్న పోలీసులు

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కట్టంగూర్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పరడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరడ గ్రామానికి చెందిన స్వాతి(27)కి అదే గ్రామానికి చెందిన పరడ మహేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప సంతానం. భర్తతో మనస్పర్థల కారణంగా స్వాతి కొంతకాలంగా గ్రామంలోని తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. మూడు నెలల క్రితం పెద్దమనుషుల సమక్షంలో విడాకులు తీసుకునేందుకు ఇరు కుటుంబాలు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన స్వాతి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప పైపుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం


రమాదేవి


తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన కంచర్ల రమాదేవి అదృశ్యమైనట్లు గురువారం ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ బాబు పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రమాదేవి ఫిబ్రవరి 28న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం రమాదేవి తల్లి సైదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామన్నపేటలో వ్యక్తి..


శంకర్

రామన్నపేట: మండల కేంద్రంలోని వడ్డెరవాడకు చెందిన గజరాజు శంకర్(52) రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు స్థానిక ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య గురువారం తెలిపా రు. శంకర్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఎంత వెతికినా శంకర్ ఆచూకీ లభించకపోవడంతో అతడి కుమారుడు సాయి బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శంకర్ ఆచూకీ తెలిసిన వారు 9490617537 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

భువనగిరిలో ఒకరు..


వెంకటేష్

భువనగిరి : మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవెల్లి గ్రామానికి చెందిన నల్లమాస వెంకటేష్ భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 28న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం అతని తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

మఠంపల్లిలో మహిళ..


పూలమ్మ

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన కుంభం పూలమ్మ(54) ఫిబ్రవరి 28వ తేదీ నుంచి కనిపించకుండాపోయిందని ఆమె భర్త కుంభం లింగయ్య గురువారం మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పూలమ్మ మానసికస్థితి సరిగాలేదని, ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

గొల్లకురుమ లబ్ధిదారులకు షాక్!

- పక్కదారి పడుతున్న గొర్రెల పంపిణీ పథకం
- ప్రస్తుతం ఇస్తున్నవి 15 గొర్రెలు.. 5 పిల్లలు.. ఒక పొట్టేలు
- అమ్మకందారుడికి రూ.1.20లక్షలు మాత్రమే ఇచ్చేలా ఒప్పందం
- యూనిట్ల అందజేతలో మధ్యవర్తులదే హవా

మునుగోడు మండలానికి చెందిన ఓ గొల్లకురుమ లబ్ధిదారుడికి గొర్రెల యూనిట్ మంజూరైంది. అతడు అనధికార మధ్యవర్తుల ద్వారా అనంతపురం జిల్లాలో గొర్రెలను కొనుగోలు చేశాడు. అయితే, అతడికి సదరు రైతు మాత్రం లబ్ధిదారుడికి పదిహేను గొర్రెలు.. ఐదు పిల్లలు.. ఒక పొట్టేలు మాత్రమే ఇచ్చాడు. ఇదేమిటని అమ్మకందారుడిని అడిగితే నాకు ఇచ్చేది రూ.1.20లక్షలు మాత్రమేనని, మిగిలిన రూ.38వేలు తిరిగి మధ్యవర్తులకు ఇవ్వాలి. అందుకే ఆ డబ్బులకు సరిపడా 5పిల్లలు ఇస్తున్నామని చెప్పడంతో ఆ లబ్ధిదారుడు షాక్ తిన్నాడు.

మునుగోడు: రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమల ఆర్థిక అభివృద్ధికి అందిస్తున్న గొర్రెల పంపిణీ పథకం పక్కదారి పడుతోంది. నిబంధనల ప్రకారం ఒక్కో యూనిట్‌కు 20గొర్రెలు, ఒక పొట్టేలును అందించాల్సి ఉన్నా మాంసం ధరలు పెరిగాయంటూ యూనిట్‌లో ఐదు గొర్రెలు తగ్గించి వాటి స్థానంలో పిల్లలను అంటగడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఏడు మండలాలకు 7,400 యూనిట్లు

మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు 7,400 యూనిట్లు మంజూరయ్యాయి. అయితే, ప్రభుత్వం ఇటీవల మునుగోడు, చండూరు మండలాల్లోని లబ్ధిదారులకు యూనిట్లను మంజూరు చేస్తోంది. కాగా, మునుగోడు, చండూరులో లబ్ధిదారులకు పంపిణీ చేసిన 193 యూనిట్లను ఇదే తరహాలో అంటగట్టినట్లు తెలిసింది.


ఇటీవల అనంతపురం జిల్లాలో ఓ లబ్ధిదారుడు కొనుగోలు చేసి తీసుకొచ్చిన గొర్రెలు

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

గొర్రెల కొనుగోలు విషయంలో లబ్ధిదారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. గొర్రెలు అమ్మే రైతుల వద్దకు వెళ్లి లబ్ధిదారులు నచ్చినవి కొనుగోలు చేస్తే అప్పుడు మా వైద్యులు అవి ఆరోగ్యంగా ఉన్నాయ లేదా పరిశీలించి ట్యాగ్ వేసి పంపిస్తున్నారు. మాంసం ధరలు పెరిగిన కారణంగా గొర్రెల అమ్మకందారులు ధరలు పెంచి అమ్ముతునట్లు తెలిసింది. రైతులకు నచ్చకపోతే మరో చోట కొనుగోలు చేయాలి. కానీ మధ్యవర్తులను ఆశ్రయించొద్దు.
– డాక్టర్.యాదగిరి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నల్లగొండ

మధ్యవర్తులతో..

అనధికార మధ్యవర్తులు లబ్ధిదారులను గొర్రెల అమ్మకందారుడి వద్దకు తీసుకెళ్లి బేరం ఆడిస్తున్నారు. ఆ యూనిట్‌కు ఎన్ని డబ్బులు ఇవ్వాలి అనే నిర్ణయం అంతా అక్కడే ఉన్న ఆ మధ్యవర్తులదే అని విశ్వసనీయంగా తెలిసింది. గతంలో జిల్లా చుట్టుపక్కల గల మాచర్ల, గుంటూరు జిల్లాల్లో గొర్రెలను కొనుగోలు చేసేవారు. అయితే వాటిని లారీలో తీసుకొచ్చి ఆ వెంటనే మరుసటి రోజు లేదా నాలుగు, ఐదు రోజుల తర్వాత ఆ అమ్మిన వ్యాపారి ఆ గొర్రెలను మళ్లీ కొనుగోలు చేసి తీసుకెళ్లేది. అయితే, ఇప్పుడు దాదాపు 500 కిలోమీటర్లకుపైగా దూరం ఉన్న అనంతపురం జిల్లాలో కొనుగోలు చేస్తుండడంతో తిరిగి అక్కడికి తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు అధికమవుతున్నాయని, అలా కాకుండా అమ్మే సమయంలో తమ కమీషన్ అధికంగా పొందేందుకు వ్యాపారులు 20గొర్రెలకు బదులుగా అందులో 15గొర్రెలు, 5పిల్లలను పెట్టి లబ్ధిదారులుకు ఇప్పిస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలా అమ్మిన రైతుకు ఒక్కో గొర్రెకు రూ.7వేల చొప్పున రూ.1.5లక్షలు, పొట్టేలుకు రూ.10వేలు, 5పిలలకు ఒక్కోదానికి రూ.2వేల చొప్పున రూ.10వేలతో కలిపి మొత్తం రూ.1.20లక్షల నుంచి రూ.1.25లక్షలు మాత్రమే ఇచ్చేలా అనధికార మధ్యవర్తులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన లబ్ధిదారుడు తన బ్యాంక్ ఖాతా ద్వారా అమ్మిన రైతుకు ట్రాన్స్‌ఫర్ ఓచర్‌పై రూ.1.58లక్షలకు సంతకాలు పెట్టించి ఇస్తున్నారు. ఆ డబ్బులు అమ్మిన రైతు బ్యాంక్ ఖాతాలో జమైన తరువాత ఒప్పందం ప్రకారం రూ.1.20లక్షలు తీసుకుని మిగిలిన రూ.30వేల నుంచి రూ.35వేలు ఆ వ్యాపారికి ఇస్తున్నట్లు సమాచారం. అందులో రూ.20వేలకు పైగా సంబంధిత శాఖ నిర్వాహకులకు అప్పగించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తమకు పథకం కింద పూర్తి ప్రయోజనం చేకూరడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.